## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బౌద్ధనగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఉపసభాపతి పద్మారావు గౌడ్, కార్పొరేటర్ కంది శైలజ

అడ్డగుట్ట, అక్టోబర్ 4 : కోట్ల రూపాయల వ్యయంతో సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. బుధవారం బౌద్ధనగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కందిశైలజ, అధికారులతో కలిసి రూ.2 కోట్ల నిధులతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు అంబర్‌నగర్, ఎల్ నారాయణ నగర్, ఈశ్వరీబాయి నగర్, బౌద్ధనగర్, వారాసిగూడ, అశోక్ నగర్, సంజీవపురం ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని, అభివృద్ధిని నిరంతరం ప్రక్రియగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నేతలు కిశోర్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, అధికారులు , పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

### టీఆర్టీ క్వార్ట్సలో కార్పొరేటర్ పర్యటన

సికింద్రాబాద్,అక్టోబర్4: వీధులను స్థానిక ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు.రోడ్లపై చెత్త ,మట్టి కుప్పలు పోస్తున్నట్లు తన దృష్టికి ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు.ప్రధాన రోడ్లపై ఇష్టానుసారంగా,ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి కుప్పలు,చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జలమండలి సీతాఫల్‌మండి సెక్షన్ మేనేజర్ అన్విత్ తదితరులు పాల్గొన్నారు.

### 'మోదీ అలా మాట్లాడటం సరికాదు'

సికింద్రాబాద్,అక్టోబర్4: నిజామాబాద్ పర్యటనలో కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలను సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ తీవ్రంగా ఖండించారు.ఒక ప్రధాన మంత్రి స్థాయి వ్యక్తి చిల్లర రాజకీయ వ్యాఖ్యలు చేయడం అత్యంత శోచనీయమన్నారు.కేటీఆర్‌ని ముఖ్యమంత్రిని చేయడానికి శాసన సభ్యుల ఆమోదం ,తెలంగాణ ప్రజల ఆశీర్వాదం ఉంటే సరిపోతుందన్నారు.ముచ్చటగా మూడవ సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

### నేటి నుంచి రెండు రోజుల పాటు మూల్యాంకనంలో సంస్కరణలపై వర్క్‌షాప్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఇటీవల ప్రవేశపెట్టిన మూల్యాంకనంలో సంస్కరణలు, నిరంతరం, సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) అమలుపై గురువారం నుంచి రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ క్యాంపస్, కాన్‌స్టిట్యూయెంట్, అఫిలియేటెడ్ కళాశాలల అధ్యాపకులు ఈ వర్క్‌షాప్‌నకు హాజరుకావాలని సూచించారు. ఠాగూర్ ఆడిటోరియంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు ఈ వర్క్‌షాప్ జరుగుతుందని చెప్పారు. సీఈసీ పటిష్టంగా అమలు చేసేందుకు ఈ వర్క్‌షాప్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. అధ్యాపకులు తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు.



సికింద్రాబాద్ కార్పొరేటర్లతో కలిసి బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

# బతుకమ్మ కానుకలు పంపిణీ

**చీరల పంపిణీలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి**

సికింద్రాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ,అక్టోబర్4: సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని అడగుట్ట,మెట్టుగూడ,సీతాఫల్‌మండి,బౌద్ధనగర్, తార్నాక డివిజన్లతో కలిపి 17 కేంద్రాల ద్వారా 65,972 మందికి బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.దసరా పండుగ వరకు అర్హులైన వారందరికీ బతుకమ్మ చీరల పంపిణీకి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్‌రెడ్డి,శ్రీనాథ్, కార్పొరేటర్లు సునీత, సామల హేమ,బీఆర్ఎస్ నాయకులు కిశోర్‌కుమార్, రామేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**బతుకమ్మ చీరల పంపిణీని ప్రారంభించిన డిప్యూటీ మేయర్**

తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ చీరల పంపిణీని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి ప్రారంభించారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డితో కలిసి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలకు చీరలను అందజేస్తోందని గుర్తు చేశారు. ఈ ఏడాది సైతం బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 481 కేంద్రాల్లో 9,40,369 చీరలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ నెల 13వ తేదీ వరకు ఈ పంపిణీని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బీసీలకు న్యాయం

**బీసీ కుల వృత్తిదారుల చెక్కుల పంపిణీలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



మారేడ్‌పల్లిలో బీసీ కుల వృత్తిదారులకు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జి. లాస్యనందిత

మారేడ్‌పల్లి, అక్టోబర్ 4: ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన కుల వృత్తులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పూర్వ వైభవం తీసుకొచ్చినట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటో గ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు చెందిన 400 మంది బీసీ కుల వృత్తిదారులకు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయంను కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జి. లాస్యనందితతో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి జి. లాస్యనందిత, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆశన్న, కార్పొరేటర్లు హేమలత, టి. మహేశ్వరి,బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరిక, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ, ఆకుల రూప, మాజీ బోర్డు సభ్యుడు మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

**కేటీఆర్ సీఎం కావడానికి మోదీ అనుమతా..?**

రాష్ట్ర సీఎంగా మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కావడానికి ప్రధాని మోదీ అనుమతి తమకు అవసరం లేదని, ప్రధాని వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

### బీసీల పక్షపాతి సీఎం కేసీఆర్



కార్ఖానాలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితను కలిసిన బీసీ బంధు లబ్ధిదారులు

కంటోన్మెంట్, అక్టోబర్ 4: రాష్ట్రంలో అన్ని సంక్షేమ పథకాల్లో బీసీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, బీసీల పక్షపాతి సీఎం కేసీఆర్ అని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత అన్నారు. ఈ మేరకు పలువురు బీసీబంధు లబ్ధిదారులు బుధవారం కార్ఖానాలోని క్యాంపు కార్యాలయంలో లాస్యనందితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులంతా లాస్యనందితకు స్వీట్లు ఇచ్చి, ధన్యవాదాలు తెలిపారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న మాదిరిగానే లాస్యనందితకు కూడా తాము మద్దతిస్తామని ప్రకటించారు. బీసీలంతా గులాబీ పార్టీ వెంటే ఉంటారని స్పష్టం చేశారు.

# మీలో ఒకరినై ఉంటా..

- మీ ఆదరణ ఎన్నటికీ మర్చిపోను..
- కార్యకర్తలే పార్టీకి బలం
- మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను గెలిపించుకుందాం
- బోర్డు పరిధిలోని మూడు, నాలుగు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత పాదయాత్ర

కంటోన్మెంట్/మారేడ్‌పల్లి, అక్టోబర్ 4:కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మీలో ఒకరినై ఉండడంతో పాటు అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లాస్యనందిత స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఆదరణ మర్చిపోలేనిదని పేర్కొన్నారు. బోర్డు పరిధిలోని మూడు, నాలుగు వార్డుల్లో స్థానిక బోర్డు మాజీ సభ్యులు అనితాప్రభాకర్, నళినికిరణ్‌లతో కలిసి బుధవారం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లాస్యనందిత పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బాలంరాయి, ధోబీ బస్తీల్లో ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు.పార్టీ అభ్యర్థి లాస్యనందిత మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో యావత్ దేశానికే ఆదర్శంగా తెలంగాణ మారిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన అందిస్తున్న బీఆర్ఎస్ కు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. అభివృద్ధితో పాటు ప్రజలకు సేవలందించేందుకే పూర్తి సమయం కేటాయించారన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ తనకు అవకాశం కల్పించారన్నారు. వార్డుల్లో పాదయాత్రగా బయలుదేరి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించుకుంటూ ముందుకు సాగారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి భరోసానిస్తూ ముందుకు కదిలారు. పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, సీనియర్ నాయకులు వినోద్, శ్రీకాంత్, గంగారామ్, మహేశ్, నరేశ్, లడ్డూ, పరిమళ్, విష్ణు, సతీశ్, సందీప్, శత్రుఘ్న మధు, గజ్జెల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



బాలంరాయిలో వృద్ధుడిని పలకరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లాస్యనందిత



మూడు, నాలుగో వార్డులోని పలు బస్తీల్లో ఇంటింటా తిరిగి ఓట్లను అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లాస్యనందిత